# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం 09 డిసెంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm


## నీతా అంబానీకి సీఎన్‌బీసీ అవార్డు




ముంబై: రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ నీతా ముఖేశ్ అంబానీకి.. సీఎన్బీసీ-టీవీ18 అవార్డు దక్కింది. ఇండియా బిజినెస్ లీడర్ అవార్డులను శనివారం ముంబైలో అందజేశారు. ఔట్‌స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ టు బ్రాండ్ ఇండియా అవార్డును నీతా అంబానీ గెలుచుకున్నారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా ఆమె అవార్డును స్వీకరించారు. ఈ విషయాన్ని రిలయన్స్ ఇండస్ట్రీ సంస్థ తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది.

## నెలలో ఒకరోజు వసతి గృహాలకు..

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ : నెలలో ఒక రోజు వసతి గృహాలకు వెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సీఎంతో పాటు సభ్యులందరూ వసతి గృహాలను పరిశీలిస్తారని చెప్పారు. హైదరాబాద్‌లో విలేకరులతో భట్టి విక్రమార్క మాట్లాడారు. డిసెంబర్ నెల నుంచే హాస్టళ్లలో పర్యటిస్తామని.. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తామన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఇందుకోసం రూ.5వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.







## సభాపర్వం







## అసెంబ్లీ సమావేశాలు 16కు వాయిదా

హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ, మండలి సమావేశాలు ఈ నెల 16వ తేదీకి వాయిదా పడ్డాయి. తెలంగాణ తల్లి విగ్రహ విష్కరణకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రకటనపై సభ్యులు మాట్లాడిన తర్వాత సభను 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. అయితే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు నిప్పులు చెరిగారు. అక్రమ అరెస్టులపై మండిపడ్డారు. అదానీ రేవంత్ దోస్తానాపై ప్రశ్నిస్తామనే భయంతోనే తమను అడ్డుకుంటున్నారని, సభకు రానివ్వడం లేదని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.



## జైపుర్, ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

### మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై చర్చించే చాన్స్

హైదరాబాద్: ఈనెల 11 నుంచి 13 వరకు మూడు రోజులపాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల పర్యటనకు వెళ్లనున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం, తొలి రోజు రాజస్థాన్‌లోని జైపూర్ సీఎం వెళ్లనున్నారు. తర్వాతి రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై వివిధ శాఖల మంత్రులు, అధికారులతో చర్చించనున్నారు. పార్టీ అధిష్ఠానంతోనూ సీఎం భేటీ అయ్యే అవకాశముంది. మరోవైపు అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 16 వరకు వాయిదా పడిన నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు, ఇతర ముఖ్యనేతలు కూడా సీఎంతోపాటు ఢిల్లీ వెళ్లే అవకాశముంది. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై పార్టీ హైకమాండ్‌తో చర్చించే అవకాశముంది.



## వారికి గౌరవం లేనట్లే

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్: ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యులు రెండూ అభిప్రాయాలు చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలపారు. అసెంబ్లీలో ఆయన మాట్లడారు. ఏదైనా అంశాన్ని సభలో పెట్టినప్పుడు సభ్యులు అభిప్రాయాలు చెప్పాలని కోరారు. అదే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి అని ప్రభుత్వం నమ్ముతుందన్నారు. తెలంగాణ తల్లిపై గౌరవం ఉంటే సభలో అభిప్రాయాలు చెప్పాలని, సభ్యులు అభిప్రాయం చెప్పకపోతే తెలంగాణ తల్లిపై గౌరవం లేనట్లేనని విమర్శించారు.

## గ్యారంటీలకు కట్టుబడి ఉన్నాం

### కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

### ప్రతిపక్షాలది తప్పుడు ప్రచారమని వ్యాఖ్య

హైదరాబాద్ : 6 గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్ హామీ అమలవుతోందని వెల్లడించారు. హామీలపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మొద్దు అని జగ్గారెడ్డి వెల్లడించారు.



## ఆదర్శ రాష్ట్రంగా పేరు తెచ్చుకోవాలి

### ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్ : తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా పేరు తెచ్చుకోవాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు తావు లేకుండా తెలంగాణ తల్లి విగ్రహ తయారీ జరిగిందని, విగ్రహ రూపకల్పనలో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహ ప్రారంభ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా అందరు రావాలని పోచారం కోరారు.

## ఆశావర్కర్లపై పోలీసుల దాడులు హేయం

### హామీల అమలు కోసం రోడ్డెక్కితే ఇష్టారీతిన కొడతారా?

### ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలి

### మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ : . ఒకవైపు తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు చేస్తున్నమని గొప్పలు చెబుతూ, మరో వైపు క్షేత్రస్థాయిలో విశిష్ట సేవలందించే ఆశా తల్లులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కోఠి డీఎంఈ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన ఆశా వర్కర్ల పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించడంపై ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్ల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అభయహస్తం మేనిఫెస్టో పేజీ నంబర్ 26లో హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ అమలు చేయాలంటూ ఆశా అక్కా చెల్లెళ్లు రోడ్డెక్కితే పోలీసులతో ఇష్టారీతిన కొట్టించడం దుర్మార్గం అని మండిపడ్డారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలకు సేవలందించే ఆశా వర్కర్లకు నిరసించే హక్కు లేదా? సమస్యలు పరిష్కరించాలని అడిగే స్వేచ్ఛ లేదా? తెలంగాణ ఏర్పాటుకు మందు ఆశాల గౌరవ వేతనం రూ. 1500 మాత్రమే ఉంటే, కేసీఆర్ రూ. 10 వేలకు పెంచి వారి సేవలను గుర్తించారు, వారిని గౌరవించారన్నారు.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. ప్రశ్నిస్తే పోలీసులతో పళ్లూడగొట్టించే దుర్మార్గ వైఖరిని అవలంబిస్తూ, ఆశాల ఆశలపై నీళ్లు చల్లుతుండటం సిగ్గుచేటు అని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

